నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 05, 2024 | www.navatelangana.com

పురుగులమందు తాగి బాలుడు ఆత్మహత్య

నవతెలంగాణ-దస్తురాబాద్



పురుగులమందు తాగి బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని మున్యాల తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్యాల్ తండాకు చెందిన నగావత్ కిరణ్(14) పురుగులమందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. బాలుడి తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్థాపానికి గురై ఖానాపూర్ వెళ్లి పురుగులమందు కొనుక్కొని వచ్చి వారి పత్తి చేనులో తాగాడు. అటు వైపుగా వెళ్తున్న మేకల కాపరితో మందుతాగిన విషయాన్ని తెలుపగా, అతను కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదివారం ఉదయం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడు తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా ఇసుక, మొరం రవాణ చేస్తే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇసుక, మొరం అక్రమంగా రవాణచేస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ రవిశంకర్ అన్నారు. ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి ఆర్టీసీ డిపోలో భద్ర పరిచారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ రవి శంకర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా ఇసుక, మొరం, గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనవరి 27 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 10 వాహనాలను సీజ్ చేసి దాదాపు రూ.లక్ష వరకు జరిమాన విధించామని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు చెన్నూరులో ఇసుక రీచ్ ఉందని అక్కడి నుంచి వే బిల్లుతో తెచ్చుకోవాలని సూచించారు.

ఆదిలాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా వసతులున్న ఆదిలాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం అభినందనీయమని ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఖేలో ఇండియా సెంటర్ ద్వారా హాకీ క్రీడకారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు హాకీ స్టిక్స్ అందించి మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఇండియా ఫెడరేషన్ ఆఫ్ హాకీకి అధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. జిల్లా క్రీడాకారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. క్రీడాకారులు శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఆటలు ఎంతో మందికి ఉపాధినిచ్చాయని, స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్ధసారథి, కోచ్ శ్రీనివాస్, క్రీడకారులు పాల్గొన్నారు.

సీఎం సార్ మా నిధులు మాకు కేటాయించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి కేటాయించిన రూ. 50 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లించిందని ఆరోపిస్తూ వెంటనే మా నిధులను మాకే కేటాయించాలని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీ బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని చెప్పన సీఎం రేవంత్‌రెడ్డి పట్టణాభివృద్ధికి కేటాయించిన నగదును రాకుండా అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి రూ.50కోట్లు విడుదల అయ్యాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో న్యూహౌసింగ్ బోర్డ్ బీఆర్ఎస్ నాయకులు పవన్ నాయక్, రాథోడ్ ప్రకాష్, దీపక్, విలాస్, తులసి రామ్, పోచ్చారెడ్డి, కలీం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-బోథ్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కౌట(బి) గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అనిల్ అన్న విజయానికి అంకితంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై, క్రీడకారులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయని అన్నారు. యువకులు క్రీడల్లో రాణిస్తూనే, సమాజాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు అంతరాయం..!

- జిన్నింగ్‌లలో నిండుకున్న పత్తి నిల్వలు
- మార్కెట్‌యార్డుల్లో నిలిచిపోయిన కొనుగోళ్లు
- సీడ్ తరలించకపోవడమే కారణమంటున్న అధికారులు
- విక్రయానికి ఆపసోపాలు పడుతున్న అన్నదాతలు

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లకు మళ్లీ అంతరాయం కలిగింది. ఇదివ రకు కొనుగోలు చేసిన పత్తి నిల్వలు జిన్నింగ్ మిల్లుల్లోనే నిండుకోవడంతో కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆయా జిన్నింగ్‌ల నుంచి సీడ్ తరలిపోకపోవడమే ఇందుకు కారణమని అధికారులు చెబుతుండగా.. కొనుగోళ్లు నిలిచిపోవడంతో పత్తి విక్రయానికి అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు. ఫలితంగా ఆదిలాబాద్ జిల్లాలో కేవలం రెండు మార్కెట్‌యార్డుల్లో మాత్రమే పత్తి విక్రయాలు జరుగుతుండటం.. మిగితా ప్రాంతాల్లో నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం కొనుగోళ్లు నిలిపివేయలేదని.. ఇక్కడి నుంచి సీడ్‌ను వ్యాపారులు తీసుకెళ్లకపోవడంతోనే కొనుగోళ్లు చేసిన పత్తి నిల్వలు సామర్థ్యానికి కంటే అధికంగా పేరుకుపోయాయని చెబుతున్నారు. రెండు, మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడిస్తున్నారు. మరోపక్క కొనుగోళ్లు నిలిచిపోయాయనే సమాచారం వ్యాప్తి చెందడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పంటగా పత్తి. ఇక్కడ పండించిన పత్తికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఎనలేని డిమాండ్ ఉంటుంది. కానీ ఈ సారి సైతం మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో కొన్ని సార్లు ప్రభుత్వ మద్దతు ధర కూడా మార్కెట్‌లో దక్కని పరిస్థితి తలెత్తింది. అనేక ఆటుపోట్ల మధ్య కొనసాగిన పత్తి కొనుగోళ్ల పర్వం మరికొద్ది రోజుల్లో తుది అంకానికి చేరుకోనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సుమారు 80లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ.. పంట దిగుబడి తగ్గిపోవడం కారణంగా సుమారు 60లక్షల వరకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 16లక్షల క్వింటాళ్ల వరకు పత్తి మార్కెట్‌కు వచ్చింది. మరో 8లక్షల క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇంకా పత్తి నిల్వలు రైతుల ఇంట్లో ఉండగానే మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోయాయనే ప్రచారం వారిని మరింత ఆందోళనకు గురిచేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 15 మార్కెట్‌లు ఉండగా ప్రస్తుతం ఆదిలాబాద్, ఇచ్చోడలో మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నారు. మిగితా వాటిలో నిలిచిపోవడంతో అక్కడ్నుంచి పత్తి బండ్లు ఈ మార్కెట్‌లకు వస్తున్నాయి. వందల సంఖ్యలో ఒకేసారి వాహనాలు రావడంతో ఈ మార్కెట్‌యార్డులు కిక్కిరిసిపోతున్నాయి.



సీడ్ తరలిపోకపోవడంతోనే..?

మార్కెట్‌యార్డుల్లో కొనుగోలు చేసిన పత్తిని స్థానిక జిన్నింగ్‌లకు తరలిస్తున్నారు. ఇక్కడి జిన్నింగ్‌లలో రోజువారీగా తయారయ్యే బెల్‌లు, సీడ్‌లను మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కానీ వారం రోజులుగా సదరు వ్యాపారులు తీసుకెళ్లకపోవడం మూలంగా.. జిన్నింగ్‌లలో సీడ్ నిల్వలు అలాగే ఉండిపోతున్నాయి. కానీ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పత్తి నిల్వలు మాత్రం పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రాంతాల్లో మినహాయించి మిగితా జిన్నింగ్‌లలో ఒక్కో దాంట్లో సుమారు 7వేల క్వింటాళ్ల వరకు పత్తి నిల్వలు ఉన్నట్లు సమాచారం. జిన్నింగ్‌లలో తయారయ్యే బెల్‌లు మాత్రం తరలిపోతున్నా సీడ్ అలాగే ఉండిపోవడంతో పత్తి నిల్వలు నిండుకుంటున్నాయి. ఫలితంగా కొన్ని రోజుల పాటు ఆయా మార్కెట్‌లలో పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు తెలిసింది. కానీ స్థానికంగా కొనుగోళు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటికొచ్చిన పంటను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోలేక..దూరభారం భరిస్తూ ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఫలితంగా దూరభారంతో పాటు ఆర్థిక భారం కూడా భరించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభం

శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్



పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయనే సమాచారంతో రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు. ఆయా జిన్నింగ్‌ల నుంచి సీడ్ తరలించకపోవడంతోనే పత్తి నిల్వలు నిండుకొని కొన్ని రోజుల పాటు విక్రయాలు నిలిచిపోయాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు సైతం దృష్టిసారించారు. రైతుల వద్ద నుంచి పత్తి మొత్తం కొనుగోలు చేసే వరకు మార్కెట్‌యార్డులు కొనసాగించాలని ఆదేశించారు. నిలిచిపోయిన వాటిలో ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మానవ జీవితంలో అన్నింటికన్నా అత్యంత విలువైనది ఆరోగ్యమేనని దానిపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో దియాలిబాయి లాల్ చంద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ దయానంద్ గౌరీ, సభ్యులు మీరా గౌరీ వారి సౌజన్యంతో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఉద్యోగుల కొరకు ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం, మెగా న్యాయ అవగాహన సదస్సుకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా న్యాయమూర్తి ఎం.వి.రమేష్, కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని, అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. ప్రపంచం క్యాన్సర్ ముప్పును ఎదుర్కొంటుందని, ప్రాథమిక స్థాయిలోనే నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స తీసుకొని వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్, కార్డియాక్ స్క్రీనింగ్, ఈఎస్‌టీ, డయాబెటిస్, దంత సమస్యలు, ఇతరత్రా వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి వ్యక్తి న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టం ముందు అందరూ సమానమన్నారు. 1987 సంవత్సరంలో సుప్రీంకోర్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ప్రారంభించడం జరిగిందని, పేదలు న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు తమ కేసులపై సేవలను పొందవచ్చన్నారు. చట్టంలోని ప్రతి అంశంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం మండలాలు, గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ బొర్కడే హేమంత్ మాట్లాడుతూ మెగా వైద్య శిబిరం ద్వారా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టేబ్రివాల్, డీఎంహెచ్ఓ తుకారాం, ఆసిఫాబాద్, సిర్పూర్ జూనియర్ సివిల్ జడ్జిలు యువరాజ్, అజయ్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోనగిరి సతీష్, న్యాయవాదులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని సెక్రటరీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన పంచాయతీ సెక్రెటరీ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఓమర్ హుస్సేన్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం సెక్రటరీలను రెగ్యులర్ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌గా ప్రమోట్ చేయాలని కోరారు. జేపీఎస్‌లకు వెంటనే రెగ్యులర్ సర్వీస్ ఇవ్వాలన్నారు. డీపీఓ ఉమర్ హుస్సేన్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు గ్రామాల అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సెక్రటరీలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ముఖ్య అతిథులను జిల్లా పంచాయతీ సెక్రటరీల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి శ్రవణ్, జిల్లా కమిటీ సభ్యులు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆధునాత పద్దతులు పాటించాలి



- రైతులను, రైతు కూలీలకు కాపాడుకోవాలి
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ సంతోష్

నవతెలంగాణ-హాజీపూర్

మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో ఆధునాతన పద్దతు పాటించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో హాజీపూర్ ఎఫ్‌పీసీ అధ్వర్యంలో ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సు, ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు, బ్యాంక్ అధికారులు, విత్తన కంపెనీలు, వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొని పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడారు. దేశ జనాభాలో 60 శాతం మంది రైతులు ఉన్నారన్నారు. అలాంటి రైతులకు సాగుకు ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి 25 రకాల కూరగాయలు వస్తున్నాయన్నారు. అదే ఇక్కడి రైతులు వాటిపై దృష్టి సారిస్తే లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. దీనికోసం ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోవు రోజుల్లో నియోజకవర్గంలో రైతులు మూడు పంటలు సాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు మరింత ఆదాయం పొందే వీలుందని పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రతి ఇంటిలో కనీసం రెండు పశువులు ఉండేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చూడాలన్నారు. రాబోవు రోజుల్లో రైతు ఆదాయం రెట్టింపు చేసే క్రమంలో అవసరమైన గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మాణం జరిగేలా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బ్యాంక్ అధికారులు రైతులకు కావాల్సిన రుణాల మంజూరులో సహకరించాలని కోరారు. నియోజకవర్గ రైతుల అభివృద్ధికి రాబోవు రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలి

రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకాంక్షించారు. రైతు బాగుంటేనే అందరికీ తిండి దొరుకుతుందన్నారు. అలాంటి రైతులకు బ్యాంకర్లు ఇబ్బందులు పెట్టకుండా పంట రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. రుణాల కోసం బ్యాంక్‌లకు వచ్చే రైతులకు కనీస గౌరవం ఇవ్వాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌తో కలిసి రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సాధారణ మహిళగా..!

జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో రైతు అవగాహన సదస్సులో రైతులు, వ్యవసాయ రంగ అనుబంధ శాఖల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే సతీమణి కొక్కిరాల సురేఖ సాధారణ మహిళగా సమావేశ మందిరంలో చివరన అధికారుల వెనుక కూర్చొని సమావేశంలో జరిగే విషయాలను నోట్ చేసుకుంటూ కనిపించారు. అధికారం హోదా ఉన్న కానీ సామాన్య వ్యక్తిలా ఇతర అధికారుల వెనుకాల ఏర్పాటు చేసిన కుర్చీలో కూర్చొని సమావేశం ముగిసే వరకు ఉండటంపై పలువురు చర్చించుకున్నారు. సురేఖ హుందాతనాన్ని పలువురు కొనియాడారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో కూరగాయల విత్తనాలు, సేంద్రీయ పంటలను స్వయంగా పరిశీలించి కొనుగోలు చేశారు.

11న బహిరంగ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-బెజ్జూరు

ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె విజయవంతంపై ఈ నెల 11న కాగజ్‌నగర్‌లో నిర్వహించే సన్నాహక సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 11న మధ్యాహ్నం 12 గంటలకు కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభకు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను దిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికి వెళ్లి క్యాంపెయిన్ చేయాలన్నారు. ఫిబ్రవరి 16న జరుగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని, జాయింట్ ప్లాట్‌ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో నిర్ణయించాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల సమ్మె గ్రామీణ బందు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, జిల్లాలోని వివిధ కార్మిక సంఘాల్లో పనిచేసే కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దుర్గా, పి.స్వప్న, భారతమ్మ ఆర్.స్వప్న, తిరుపతమ్మ, మధ్యాహ్న భోజన పథకం మండల అధ్యక్షురాలు బాయక్క, కార్యదర్శి సువర్ణ, నాయకులు సునీతా, పశుమిత్ర రంగం మండల నాయకులు సునీత, సుజాత పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని బాలాజీ అనుకొడ రైతు వేదికలో ఆదివారం సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 11న నిర్వహించే సన్నాహక సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ల పరం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ విలాస్, గ్రామ పంచాయితీ సంఘం జిల్లా నాయకులు నగేష్, రవి, అంగన్వాడీ నాయకులు కళావతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షులు పద్మ, కార్యదర్శి వనిత, కోశాధికారి విమల, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు గౌరక్క, అమృత, కమల, సుగుణ, రంగక్క, శాంత పాల్గొన్నారు.


బెజ్జూర్


చింతలమానేపల్లి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 05, 2024 | www.navatelangana.com

క్రికెట్ పోటీలను ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేగామ గ్రామంలో జూనియర్ యువసేన యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ఆటపాటలతో స్నేహపూర్వక సంబంధాలు పెరిగి ఆరోగ్యంగా ఉంటామన్నారు. నేటి యువత ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న, మైనారిటీ సెల్ అధ్యక్షులు రఫీక్, గ్రామస్తులు సుభాష్, అనిల్, యువకులు దిలీప్, సచిన్, శంకర్, ఆకాష్ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని కునికాసా గ్రామం కుమురంభీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. మూడు రోజుల పాటుగా నిర్వహించిన టోర్నమెంట్‌లో మొదటి బహుమతి మత్తడిగూడ, రెండో బహుమతి రోమన్ కాసా జట్టు సాధించింది. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు గ్రామ మాజీ సర్పంచ్ కొడప జంగు, గ్రామ పటేల్ వెడ్మ దేవ్‌రావ్, ఉపసర్పంచ్ దత్తరాం మొదటి బహుమతి, రూ.8,501, రెండో మహుమతి రూ.4,501లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సాగర్, యూత్ సభ్యులు కొడప గజానంద్, జాకు ఉన్నారు.



జెడ్పీ చైర్మెన్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీలో చేరిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, పవార్ దేవిదాస్‌ను కేస్లాపూర్ నాగోబా యూత్ ఆదివాసీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్నాక్ బారిక్‌రావ్, యూత్ చైర్మెన్, మెస్రం శేక్‌నాథ్ యూత్ అధ్యక్షులు, మెస్రం దయాకర్, మెస్రం చిత్రు, కోట్నాక్ జంగు, రామ, దామోదర్, మెస్రం దినేష్, శివానంద్ మాహారాజ్, గంగారాం నాయక్ ఉన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

- జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణన వెంటనే చేపట్టాలని, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ గణన చేపట్టిన తరువాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు ఏకం కావాలని పేర్కొన్నారు. అందరూ ఏకమై రాజ్యాధికారం కొరకు కృషి చేయాలని అన్ని పార్టీల నాయకులు, యువకులు, విద్యావేత్తలను కోరారు. రానున్న రోజుల్లో బీసీల సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రతిభా కళాశాలల ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడలోని నాలుగు సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహించారు. బాలురు 640, బాలికలు 1083, మొత్తం 1723 మందికి గాను, 1684 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 97.7శాతం హాజరు నమోదయింది. ఈ పరీక్ష ద్వారా సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రవేశాలు కల్పిస్తారు.

సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్ద పీట

- పుష్యమాసంలో దేవుళ్లకు పూజలు
- కిలోమీటర్లు కాలినడకతోనే ప్రయాణం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదిలాబాద్ జిల్లా పేరు వినగానే గుర్తుకొచ్చేది అడవులు అడవిలో అగుపించేది పచ్చని గుట్టలు, కూ..కూ..మనే కోకిల రాగాలు. అందులో నివసించేది ఆదివాసులు, పోడు వ్యవసాయమే వీరికి జీవనాధారం. అడవిని నమ్ముకొని జీవించే వీరు ప్రకృతిని ఆరాధిస్తారు. అడవిలో ఉండే వీరు కొండల్లో గుహల్లో ఉండే దేవుళ్లకు నియమ నిష్టలతో పూజలు చేయడం సంస్కృతి సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తారు. పుష్యమాసం వచ్చిందంటే చాలు ఆదివాసీ గూడల్లో దేవుళ్లకు ప్రత్యేకంగా పూజిస్తారు. ఇల్లు వాకిట్లను శుభ్రపరిచి గ్రామస్తులంతా ఒకే చోట గుమిగూడుతారు. తమ కుల దేవతలు జంగుబాయి, పెర్సాపేన్, ఇంద్రాదేవి, (పోచమ్మ తల్లి) తదితర దేవతలకు వారి సాంప్రదాయ బద్ధంగా పూజలు చేసి మొక్కుతారు. పుష్య మాసంలో ఒక నెల రోజుల పాటు పాదాలకు పాదరక్షలు దరించరు. ఎంత దూరమైన కాలినడకనే వీరికి శరణ్యం. తమ దేవుళ్ల పూజకు వెళ్లేటప్పుడు వెదురు గుల్లలను ఉపయోగించి, అందులో పూజ సామాగ్రిని భద్ర పరుస్తారు.

దేవుళ్ల పూజకు గానుగ నూనె ప్రత్యేకం...

ఆదివాసులు వారి దేవతలకు పూజించేటప్పుడు ఇప్పపరక, నువ్వులు, వేరుశనగతో గానుగతో నూనెలను ఇంటివద్దనే తీస్తారు. బయటి మార్కెట్‌లో దొరికే నూనెలను వాడరు. ప్రకృతి సిద్ధమైన నూనె గింజలతో తమ ఇంటిలో నూనెను గానుగలోంచి తీస్తారు. వారి దేవతలకు నూనెతోనే దీపాలు వెలిగించడం సాంప్రదాయం. తమ ఇలవేల్పు దేవతలకు నియమ నిష్టలతో పూజించి, తమ కుటుంబానికి పిల్ల పాపలకు చల్లగా ఉంచాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని దేవుళ్లను కోరుకుంటారు. ఇలా అడవిలో ఉంటూ అడవిని నమ్మి ప్రకృతి దేవతలను ఆరాధించడం వారి ఆచార సాంప్రదాయానికి ప్రతీక.



ముస్తాబవుతున్న నాగోబా ఆలయం

- జాతరలో వెలిసిన వివిధ దుకాణాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోని రెండో అతి పెద్ద జాతరగా పేరుగాంచింది. కేస్లాపూర్ నాగోబా జాతర. ఈ జాతర ఈ నెల 9న పుష్య అమావాస్య నాడు నాగోబాకు మహా జలాభిషేకంతో పూజలు చేసి జాతరను ఆరంభిస్తారు. ఈ జాతరకు ఒక నెల ముందు నుంచే ఐటీడీఏతో పాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇటీవల నూతనంగా నిర్మించిన మందిరముతో పాటు గుడి గోపుర మండపానికి రంగులు వేసి అలంకరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల ప్రవేశ ద్వారం వద్ద వీఐపీల దర్శనం కోసం భక్తులకు సౌకర్యాలపై ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ఆదివారం పర్యవేక్షించారు. మెస్రం వంశీయులు బస చేసే మర్రిచెట్టు వద్ద పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గోవాడ్ తదితర పరిసరాల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. గోవాడ్ వెనుకల ఇరవై శాశ్వత మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించడంలో నిమగ్నమయ్యారు. జాతరకు ప్రారంభానికి మరో ఐదు రోజులు సమయం ఉంది. ఇప్పటికే వివిధ హోటళ్లు, రంగుల రాట్నం తదితర దుకాణాలు వెలుస్తున్నాయి. మహారాష్ట్ర యావత్‌మాల్‌కు చెందిన భక్తులు ఇప్పటికినే నాగోబా ఆలయ ప్రాంతానికి చేరుకొని దర్శనం పూజలు చేస్తున్నారు. మరో వైపు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓ ఖుష్బు గుప్తా సోమవారం నాడు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

- సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలి
- ఇంద్రవెల్లి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- ఖబర్దార్ బీఆర్‌ఎస్ నాయకుల్లారా
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో పర్యటించడం శుభ పరిణామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 2న ఇంద్రవెల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న, తెలంగాణ పునర్‌నిర్మాణ సభ విజయవంతమైందని పేర్కొన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకోవటానికి ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ట్రైకార్ లోన్‌తో పాటు ఇంటి నివాస స్థలం, నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నాగోబా ఆలయ అభివృద్ధి కోసం రూ.7కోట్ల నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం నిధులను కేటాయించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా ఎన్నో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్‌తో పాటు కొందరు నాయకులు పిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 10 ఏండ్ల పాటు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఇంద్రవెల్లి స్మృతి వనానికి సీఎం రూ.కోటి కేటాయించి శంకుస్థాపన చేస్తే కొందరు నాయకులు మాత్రం స్తూపం వద్దకు చెప్పులతో వచ్చారని శుద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టడాన్ని ఖండించారు. స్తూపం వద్దకు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఎవరు చెప్పులు వేసుకొని వెళ్లలేదని, ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు సాయం చేయడాన్ని కొంతమంది నాయకులు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని త్వరలో 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు రూ.500లకే గ్యాస్ ఇస్తామన్నారు. మిషన్ భగీరథ నీళ్లు నియోజకవర్గంలో ఎక్కడ రావడం లేదని అన్నారు. సమయం లేక సంఘాల నాయకులకు కలువలేక పోయడాని, గురుకుల పాఠశాల, అమర్ వీరుల స్తూపం, నాగోబా జాతరల కోసం బడ్జెట్‌ను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి ఉంటుందని తెలిపారు. కూల్చే దమ్ము ఎవరికి లేదని, ప్రజా సంఘాల నాయాకులు అందరూ కలిసి మన ప్రభుత్వాన్ని అభివృద్ధి చేద్దామని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని పేర్కొన్నారు. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉదయం 7గంటలకు, సాయంత్రం 9గంటలకు ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వరకు రాను, పోను ఆదిలాబాద్‌కి వెళ్లే ఒక బస్సును ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, కడెం మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, దస్తురాబాద్ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కన్నాపూర్ మాజీ సర్పంచ్ రఘురామ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ హక్కుల పోరాట యోధుడు మగ్దూం

- ఎస్టీయూ వ్యవస్థాపకుడు మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ వర్గాన్ని చైతన్య పరుస్తూ, స్టేట్ టీచర్స్ యూనియన్ హైదరాబాద్ పేరుతో ఉపాధ్యాయ సంఘం స్థాపించి, ఉపాధ్యాయ హక్కులకై పోరాటం చేసిన పోరాట యోధుడు, ఎస్టీయూ వ్యవస్థాపకులు మగ్దూం మొహియుద్దీన్ అని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎస్టీయూ సంఘం కార్యాలయంలో ఎస్టీయూ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, కార్మిక నాయకుడు, మగ్దూం మొహియుద్దీన్ 116 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 1908, ఫిబ్రవరి 4న జన్మించారని ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా అన్ని వర్గాలకు సమన్యాయం కోసం నిలిచి, ఉద్యమం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. విద్యారంగ సంక్షేమం కోసం, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం మొహియుద్దీన్ చూపిన మార్గంలో నడుస్తామని, సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతామని అన్నారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలక విలాస్, నాయకులు పోచ్చారెడ్డి, కబీర్‌దాస్, ముఖీం జానీ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా విద్యార్థి దశనుంచే ఉద్యమాల్లో పాల్గొన్న మగ్ధూం మొహియుద్దీన్ అనతికాలంలోనే ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాన్ని స్థాపించి, వారి సమస్యల పరిష్కారానికి నాంది పలికిన మహనీయుడని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మగ్దూం మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 1952లో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. అనంతరం సీపీఐ లో చేరి అప్పటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. అంతటితో ఆగకుండా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలో ఈయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజాసేవకు అంకితమై ఉపాధ్యాయ సంఘాన్ని స్థాపించి వారి సమస్యల పరిష్కారానికి సైతం నాంది పలికారన్నారు.

నేటి యువత ఉద్యోగ ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకొని, ప్రజా పోరాటాల కోసం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.అరుణ్ కుమార్, బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, సీపీఐ సీనియర్ నాయకులు బత్తినీ గణపతి, పెద్ది నర్సింలు, పెద్ది మధుసూదన్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

మాజీ సర్పంచులందరికీ అండగా ఉంటానని, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చర జలపాతం వద్ద ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వరంలో సామూహిక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సర్పంచులు అందరూ అధైర్య పడొద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే సర్పంచ్‌లతో పాటు ప్రజలకు లందరికీ ఎప్పుడు అండగా ఉంటానని అన్నారు. సర్పంచ్‌ల బిల్లుల విషయమై ఎవరు కలత చెందవద్దని, నేను దగ్గరుండి బిల్లులు వచ్చేవిధంగా చూస్తానని భరోసానిచ్చారు. అలాగే అధికారంలో లేరని కలత చెందవద్దని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ ధైర్యంగా పనిచేయాలని సూచించారు. ఎవరు పార్టీని వీడీ ఎక్కడికి వెళ్లవద్దని అన్నారు. మండలంలోని 33 గ్రామాల సర్పంచులకు ఆయన చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం ప్రయివేట్ ఆస్పత్రుల సంఘం అధ్యక్షులు బండ అనిల్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతంరెడ్డి, జెడ్పీటీసీలు సుధాకర్, రాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



యువజన కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బేల

మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల ఆవరణలో జాతర ప్రారంభం కావడంతో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు కిసాన్ సెల్ బేల మండల అధ్యక్షుడు గావండే ఘన శ్యామ్, యువజన కాంగ్రెస్, బేల మండల అధ్యక్షుడు గోడే, అవినాష్, రాక్రె విపిన్, బోక్రె శంకర్, సుధాకర్, నయన్ ఉన్నారు.

తెరమీదికి ఆత్రం భాస్కర్



నవతెలంగాణ-ఉట్నూర్

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ఐటీడీఓ ఏపీఓ ఆత్రం భాస్కర్ దరఖాస్తు చేసుకున్నారు. ఆత్రం భాస్కర్ ఉపాధ్యాయులుగా, ఏటీడీఓగా సేవలు అందించారు. ఆదివాసీ గిరిజన బిడ్డగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ టికెట్ కేటాయిస్తే గెలిచి ప్రజలకు సేవచేస్తానని అన్నారు.

డిప్యూటీ కలెక్టర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ట్రస్ట్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిప్యూటీ కలెక్టర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరెడ్డి, తహసీల్దార్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములు, ఉమ్మడి జిల్లా రెవిన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం వారిని సంగెం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. ట్రస్ట్ సేవలను అడిగి తెలుసుకొని తనవంతు సహకారం ట్రస్ట్‌కు ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్‌రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, రెవిన్యూ ఉద్యోగులు వర్ల, రమేష్ రాథోడ్, రాజేశ్వర్, రాంరెడ్డి, అత్తర్, సందేశ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన సంగెం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి గోడం నగేష్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో సంగెం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకేను అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ట్రస్ట్ సేవా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రస్ట్ సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్ కుమార్ సంగెం, సభ్యులు మహేందర్‌రెడ్డి, సలీమ్, అంబయ్య ఉన్నారు.

సర్పంచ్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-నార్నూర్



సర్పంచ్ రాథోడ్ మధుకర్ సేవలు అభినందనీయమని, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు జాదవ్ పరశురామ్, ఆనంద్‌రావ్, చౌహాన్ పునిరాం, కిషోర్‌లు అన్నారు. ఆదివారం తాడిహత్నూర్ గ్రామ పంచాయతీలో పదవీవిరమణ పొందిన సందర్భంగా సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు సభ్యులకు పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 25 సంవత్సరాలుగా సర్పంచ్‌గా గెలుస్తూ గ్రామాన్ని అనేక రంగాలలో అభివృద్ధి పరిచారన్నారు. అవసరమైన వారికి తనవంతు సాయం చేయడం అభినందనీయమన్నారు. సన్మాన కార్యక్రమంలో ఉపసర్పంచ్ విష్ణు ఫడ్, గ్రామ పెద్దలు శేషారావ్ రాథోడ్, సూర్యవంశీ పండరి, గ్రామ మార్కెట్ కమిటీ సభ్యులు కోటగిరి విశాల్, సత్య నారాయణ, జాదవ్ గోకుల్, జాదవ్ ఉమాజీ, ఏట రాథోడ్ గణేష్, కేంద్రే రాంకిషన్, జాదవ్ విద్యారాణి, చకోర్ శివాజీ, రాథోడ్ భిక్కు, రాథోడ్ తానాజి, రాథోడ్ దినేష్, కెంద్రే సురేష్, మాదవ్, గ్రామ వివిధ యూత్ సభ్యులు చౌహాన్ తుకారాం, ఫడ్ రవీందర్, ఇరాలే గోపాల్, వార్డు సభ్యులు సూర్యవంశీ శివాజీ, సుభాష్, గణేష్, శ్రీమంగళి అశ్విని, లక్ష్మణ్, నాగిబాయి పాల్గొన్నారు.

మూడు కిరాణ దుకాణాల్లో చోరి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని మూడు కిరాణ దుకాణాల్లో రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్టు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలకేంద్రంలో గల లతీఫ్‌ఖాన్ కిరాణ దుకాణాన్ని రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దుకాణం తెరవడానికి వెళ్లగా దుకాణం షెటర్ పగులగొట్టి ఉంది. కౌంటర్‌లోని రూ.30 వేలు, మండోకార్ విలాస్ దుకాణంలోని కౌంటర్‌లో రూ.16 వేలు, కలావోద్దీన్ దుకాణంలో రూ.8 వేలు తస్కరించారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసినట్టు లతీఫ్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. గతంలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి దొంగతనాలకు పాల్పడిన ఘటనలున్నాయి. ప్రతి ఒక కిరాణ దుకాణ యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాను ఏర్పాటుచేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అయితే కిరాణ దుకాణంలోని సీసీ కెమెరాలను కూడా దుండగులు ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థి ఇంటికెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చిన ప్రిన్సిపల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని పీటీజీ ప్రిన్సిపల్ సురేష్ పాఠశాలకు చెందిన మండలంలోని రౌట సంకెపెల్లికి చెందిన విద్యార్థి వంశీ కొంతకాలంగా పాఠశాలకు రాకపోవడం లేదు. విద్యార్థి ఇంటికి వెళ్లి పాఠశాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్ నిర్వహించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనేక కారణాలతో తమ చదువును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా బడికి పంపించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు ఓంకార్ కృష్ణ ఉన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థికంగా చేయూతనిద్దాం

● జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ- ఆసిఫాబాద్

చిరు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి ప్రోత్సహించడం ద్వారా ఆర్థికంగా చేయూతనిద్దామని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోట్నాక భీమ్‌రావు పిల్లల ఉద్యానవనంలో ప్రతి ఆదివారం పార్కును సందర్శించే వారికి అల్పాహారం, తినుబండారాల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వారం పిల్లల ఉద్యానవనానికి కుటుంబ సభ్యులతో సందర్శనకు వచ్చేవారు బయట నుండి తినుబండారాలు కొనుగోలు చేయకుండా పార్కులోని ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులు విక్రయించే కేంద్రాల వద్ద కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని అన్నారు. తద్వారా చిరు వ్యాపారులను ప్రోత్సహించి ఉపాధి కల్పించినట్టు అవుతుందని తెలిపారు. విక్రయ కేంద్రాలలో చిరుధాన్యాలతో తయారుచేసిన తినుబండారాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసిల్దార్ రమేష్, మున్సిపల్ సిబ్బంది, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.


ప్రశాంతంగా ముగిసిన సీఓఈ ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ప్రవేశ పరీక్ష జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా సమన్వయ కర్త పోలోజు బాలరాజు తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ కోర్సుల్లో ప్రవేశం కోసం జిల్లాలో సిర్పూర్(టి) బాలుర గురుకుల విద్యాలయంలో 347 మంది విద్యార్థులకు గాను 338 మంది విద్యార్థులు, సిర్పూర్(టి) బాలికల 347 మంది విద్యార్థులకు గాను 338 మంది, ఆసిఫాబాద్ బాలురలో 528 మందికి గాను 519 మంది విద్యార్థులు, రెబ్బెన బాలికల గురుకుల విద్యాలయంలో 273 మందికి 266 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1495 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1461 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షను రాష్ట్ర ప్రత్యేక అధికారిణి ప్రశాంతి పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

జిల్లా వాసికి తెలుగు వెలుగు జాతీయ నంది అవార్డు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వాంకిడికి చెందిన నూతి అభిలాష్‌కు విద్యారంగంలో కృషి చేసినందుకు యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు-2024 ముగింపు సందర్భంగా తెలుగు వెలుగు జాతీయ నంది అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డును హన్మకొండలోని టీఎన్జీఓ భవన్‌లో ఆదివారం జరిగిన ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్.నాగరాజు. హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్ డా.మారేపల్లి సుధీర్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనమీద మరింత బాధ్యతను పెంచిందన్నారు. తన సేవలకు లభించిన గుర్తింపు ఎంతో గొప్పగా ఉందన్నారు. జిల్లా వాసికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం దుకాణంలో చోరీకి యత్నం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న కనకదుర్గ మద్యం దుకాణంలో ఆదివారం తెల్లవారు జాము ప్రాంతంలో కొంతమంది గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. దుకాణ యజమాని తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పూట దుండగులు దుకాణం ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంత వంచి గుర్తుపట్టకుండా ఉండేలా చేసి, తాళాలు పగలగొట్టారని, లోపల షెటర్‌కు కూడా తాళం ఉండడంతో దుండగుడికి వెళ్లలేదన్నారు. దీనితో దుండగుడు వెళ్ళిపోయినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ప్రభుత్వ భూములను కబ్జా నుండి కాపాడాలి

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని రాజంపేట శివారులో గల బీడీపీపీ ప్రభుత్వ భూమి డంపింగ్ యార్డ్ పక్కన చదును చేసి కబ్జాదారులు వెంచర్లు వేయడానికి సిద్ధమయ్యారన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, ఇదే అదును చేసుకొని కబ్జాదారులు ఇష్టారాజ్యంగా ఆసిఫాబాద్ చుట్టుపక్కల ఉన్న భూమిని కబ్జా చేసుకుని వెంచర్లు వేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత జిల్లా అధికారులపై ఉందని, జిల్లాలో ప్రభుత్వ భూమి ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యార్థులకు భవనాలు నిర్మించాలి కానీ ఇలా ఆక్రమణకు గురైతే చూసుకుంటూ ఉండడం ఏంటని ప్రశ్నించారు. అధికారుల స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం పాల్గొన్నారు.

10న ఎస్పీఎం కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మాట్లాడుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాజయ్య

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ఇతర సమస్యల సాధనకు ఈ నెల 10న ఉదయం 11 గంటలకు పట్టణంలోని బాలభారతి హై స్కూల్లో కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అల్లి రాజయ్య తెలిపారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిల్లును 2014 సెప్టెంబర్‌లో అక్రమంగా మూసివేసినంతరం కార్మికుల అనేక ఆందోళన ఫలితంగా 2018 ఆగస్టు 2న తెరుచుకున్నప్పటికీ ఆరు సంవత్సరాలు గడుస్తున్న మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు జగరలేదన్నారు. కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నట్టు వారి బాధలు కష్టాలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. జెకె పేపర్ మిల్లు చెప్పిందే చట్టం, చేసిందే శాసనంగా కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు ప్రారంభమై ఆరు సంవత్సరాలు కావస్తున్న కనీస సౌకర్యాలు క్యాంటీన్ లేకపోవడం దురదృష్టకరమని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స చేసే సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు జయదేవ్, ఉపాధ్యక్షులు, ఎస్పీఎం మాజీ జనరల్ సెక్రటరీ గుల్లపెల్లి నాగేశ్వరరావు, ఐక్యవేదిక ఉపాధ్యక్షులు బి. నర్సయ్య, కార్మిక నాయకులు కలికోట రమణయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు, నాయకులు అడ్వకేట్ కిషోర్, బి.వేణు, రాజ నర్సయ్య పాల్గొన్నారు.

అధికారం పోవడంతో బీఆర్ఎస్‌కు మతిభ్రమించింది

● డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదేండ్లుగా అధికారం ఉండి ఒకేసారి అధికారం కోల్పోయి లేవలేని స్థితిలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించిందని డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఎద్దేవ చేశారు. ఇంద్రవెల్లి సభపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను విలేకరుల సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల గడిల నుండి వచ్చిన ఆదేశాలతో స్థానిక నాయకులు మాట్లాడుతున్నారన్నారు. అధికారం కోల్పోవడంతో వారికి మతి తప్పిందన్నారు. ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లిలో పీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి మొదటి సభ నిర్వహించి విజయం సాధించారని, ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటి సభ విధ్వంసమైన తెలంగాణను పునర్నిర్మాణం చేయడానికి అక్కడే ప్రారంభించారన్నారు. అధికారంలోకి వచ్చి 55 రోజులు మాత్రమే పూర్తయిందని ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేసిన విషయాన్ని ప్రతిపక్షాలు మరువద్దన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రతిసారి పుట్టిన బిడ్డగా తెలంగాణను పోల్చి ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందన్నారు. తాము ఆరు గ్యారెంటీలు అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని, ఒకవేళ అమలు చేయకుంటే ప్రజలకు అడిగే హక్కు ఇస్తామన్నారు. తమది దొరల ప్రభుత్వం కాదని ప్రజాపాలన అని గుర్తు చేశారు. మంత్రి సీతక్క పై కోవలక్ష్మి మాట్లాడిన విధానం సరైనది కాదన్నారు. గతంలో ఎమ్మెల్యే సక్కు కాంగ్రెస్ నుండి గెలిచినప్పుడు ఎటువంటి బందోబస్తు ఉందో అతనికి గుర్తులేదా అని ప్రశ్నించారు. జిల్లాకు మంజూరు అయ్యే అభివృద్ధినిధులు సగం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ఉంటాయని, మిగతా సగం స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉంటాయని దీనిలో ఎవరు కలగజేసుకునే పరిస్థితి లేదన్నారు. ఇది ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు తెలిసి కూడా అనవసర రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. అంతకుముందు ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ ఆదివాసులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఆదివాసుల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనిల్ గౌడ్, వసంతరావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యామ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ అలీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మండల అధ్యక్షుడు మసాజ్ చరణ్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండి జమీర్, జిల్లా నాయకులు రాజేంద్ర కుమారి, కళావతి, ఇరుకుల్ల మంగ, అబ్దుల్ రఫీక్, గులాం జావిద్, మేకర్తి శ్రీను, కషయాయ్యా మహేష్, అసద్, శివరాం నాయక్ పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న విలువైన భూములు

● సర్పంచ్ భర్త నిర్వాకం..పట్టించుకోని అధికారులు ● ఫిర్యాదు చేసిన నామమాత్రపు చర్యలు

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గంగాపూర్ శివారులో అంతర్జాతీయ రహదారి ప్రక్కన గల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాకు గురవుతుంది. సర్పంచ్ భర్తనే కబ్జాకు పాల్పడుతున్నాడు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఆ కబ్జా స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదలు మళ్లీ రావడంతో తహసీల్దార్ పనులను ఆపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో గంగాపూర్ మాజీ సర్పంచ్ భర్త పందిర్ల మధునయ్య ఈ కబ్జాకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ భూమికి రూ. 20 నుండి రూ.30 లక్షల వరకు విలువ ఉండడంతో గతంలో కూడా ఇక్కడ కబ్జాకు పాల్పడడంతో అధికారులకు ఫిర్యాదు వచ్చాయి. అప్పటి అధికార పార్టీ నాయకులే ఉండడంతో అధికారులు కూడా చర్యలకు వెనకడుగు వేశారని చెప్పావచ్చు. అయితే రాజకీయ సమీకరణలు మారడం కొత్త ప్రభుత్వం ఏర్పడడం, సర్పంచ్ పదవీ ముగిడంతో ఇప్పటికైన చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

నా దృష్టికి రాలేదు.

ఎండీ సమీర్ అహ్మద్ ఖాన్, తహసీల్దార్

కబ్జా విషయం నా దృష్టికి రాలేదు. రికార్డులో ఎలాంటి ఆధారాలు లేవు. దీనిపై ఉన్నతాధికారులు ఏవైనా ప్రొసిడింగ్ ఇచ్చిఉండవచ్చు. దాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం షెడ్డు నిర్మాణ పనులను ఆపేశాం. క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి కబ్జా జరిగినట్లు తెలిస్తే చట్ట పరంగా చర్యలుంటాయి.

అధికారుల అండతోనే కబ్జా

ఎల్. రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

అధికారుల అండతోనే గంగాపూర్ మాజీ సర్పంచ్ భర్త మధునయ్య కబ్జాలకు పాల్పడ్డారు. విలువైన భూమిని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలి.

రేపు వినికిడి లోపం పిల్లలకు వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినికిడి లోపం ఉన్న 0-18 సంవత్సరాల పిల్లలకు ఇయర్ నౌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినికిడి లోపం గల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని, తమ వెంట ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్, సదరన్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసిన రసీదు తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ కటుకం మధూకర్ నెంబర్ 9441140434ను సంప్రదించాలన్నారు.

మెడికల్ థర్డ్ పార్టీ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన మెడికల్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాల తీసుకుంటూ పేద, బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తున్నారని తెలిపారు. చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పండుగ, జాతీయ, ఆర్జిత సెలువులు అమలు చేయాలన్నారు. థర్డ్ పార్టీ విభాగంలో 20 వేల మంది పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర వైద్యాధికారి ఉత్తర్వులు విడుదల చేసినప్పటికీ వాటిని అమలు చేయడం లేదని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సర్క్యూలర్ అమలు చేసి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల16న జరిగే దేశవ్యాప్తి సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లేష్, అశోక్, మెడికల్ కార్మికులు మురళీ, ధనరాజ్, రజిత, సాయి భీమేష్, పుష్ప, లత పాల్గొన్నారు.

సమయపాలన.. క్రమ శిక్షణతోనే విజయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

విద్యార్థులు సమయపాలన, క్రమ శిక్షణ పాటించడం ద్వారా అనుకున్న విజయాలను చేరుకోగలుగుతారని ప్రముఖ సైకాలజిస్టు సంద్ర సుధీర్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు ఆదివారం పద్మశాలి భవన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. పరీక్షల్లో ఒత్తిడి లేకుండా ఎలా సన్నద్ధం కావాలి, భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ప్రణాళిక, కార్యాచరణ ద్వారా చదువులోనే కాకుండా జీవితంలో సైతం ముందుకు వెళ్లేలా తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రొడక్టివ్, సూపర్ ప్రొడక్టివ్ వైపు మన గమనం ఉండాలని, తప్పుడు మనుషులతో స్నేహం, తప్పుడు పనులు చేయరాదని చెప్పారు. దీక్షతో ప్రయత్నిస్తే ఫలితాలు వస్తాయని, తాత్కాలిక ఆనందం కోసం కాకుండా మంచి భవిష్యత్ కోసం కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమ నిర్వహణ పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దోమల సురవర్ధన్, జియాఉల్‌హక్, దోమల వేద ప్రవీణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల 6న జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు మాజరవుతున్నట్టు తెలిపారు. మండలంలోని ఎంపీపీ, సింగిల్ విండో చైర్మెన్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వార్డుసభ్యులు, గ్రామ కమిటీ యువజన అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

10న విద్యార్థులకు పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10న జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి గెలిచిన నలుగురిని మండల స్థాయికి పంపించాలని, ఈనెల 7వ తేదీన మండల స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి పంపించాలన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈనెల 28వ తేదీన రాష్ట్ర రాజధాని రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సెల్ నెంబర్ 9441140434 సంప్రదించాలన్నారు.

నేడు జన విజ్ఞాన వేదిక చెకుముఖి టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 8, 9,10 తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలోని 8, 9, 10వ తరగతుల నుండి ఒక్కొక్కరి చొప్పున ముగ్గురుని గ్రూపుగా చేసి పోటీలకు పంపించాలని, ఇతర వివరాలకు తిరుపతయ్య నెంబర్ 9182493690ను సంప్రదించాలని సూచించారు.

భారతీయ మరాఠా మహా సంఘ్ జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారతీయ మరాఠా మహా సంఘ్ జిల్లా కమిటీనీ ఏకగ్రవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గార్గే, రాష్ట్ర యువ అధ్యక్షుడు బాజీరావ్ బోస్లే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నికైన వారికి నియమక పత్రాలు అందజేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎల్ములే దత్తు పటేల్, అధ్యక్షుడిగా అల్గం తులసిరామ్, ఉపాధ్యక్షుడిగా కిర్మరే శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులుగా దంద్రే విలాస్, ఎల్ములే దీలిప్ పటేల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్ములే మనోహర్ పటేల్ పాల్గొన్నారు.

గడ్డం వంశీకృష్ణను కలిసిన యాదవ సంఘం నాయకులు

నవతెలంగాణ-కాసిపేట

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న గడ్డల వంశీకృష్ణను యాదవ సంఘం జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పుర్ర కుమారస్వామి, జిల్లా నాయకులు మంద వెంకటేశ్, రేషవేణి రాజు పాల్గొన్నారు.



రేచిని పంచాయతీ అభివృద్ధికి నిధులు చేయాలి

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని గ్రామపంచాయతీలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. రేచిని గ్రామ పంచాయతీ పరిధిలోని బారేపల్లె గ్రామం నుంచి కిష్టాపూర్ గ్రామం వరకు, బారేపల్లె గ్రామం దగ్గరున్న మాదిగ కుంట నుంచి జక్కుల పల్లి గ్రామం వరకు, గజ్జెలపల్లి గ్రామం నుంచి అచ్చులాపూర్ సన్నాసి మఠం వరకు బీటీ రోడ్డు, సీడీ పనులు మంజూరు చేయాలని కోరారు. అంతర్గత సీసీ రోడ్డు, మురికి కాలువలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సింగల్ విండో డైరెక్టర్ సంతోష్, నాయకులు వెంకా గౌడ్, భాస్కర్ గౌడ్, ఆనందు, నగేష్, కృష్ణ, రమేష్, శ్రీనివాస్, తిరుపతి ఉన్నారు.

ఆదివాసీ మాజీ సర్పంచులకు సన్మానం


కాసిపేట

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఆదివాసీ మాజీ సర్పంచులను సన్మానించారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ఆడె జంగు, పెంద్రం కవిత, పెంద్రం రాజు, కుడిమేత లక్ష్మీలను శాలువాలతో ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ గౌరవాధ్యక్షులు ఆత్రం జంగు, అధ్యక్షుడు సంద్ర భూమయ్య, వెడ్మ కిషన్, నాయక్‌పోడ్ సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కొమ్ముల బాపు, నాగేశ్వర్, సోయం సూరు, సిడం రాందాస్, కనక గోవర్ధన్, మడావి ధర్మారావు పాల్గొన్నారు.


జైపూర్

జైపూర్ : పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు 20 మంది సర్పంచ్లను మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవి లక్ష్మణ్ ఎంపీడీఓ కార్యాలయం సిబ్బందితో కలిసి ఆదివారం ఘనంగా సన్మానించారు. 2019లో సర్పంచులుగా ఎన్నికైన వారు గడ్డు కాలాన్ని ఎదుర్కొన్నారని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. కరోనా కష్టకాలంలో రెండు సంవత్సరాలు సర్పంచులు పంచాయతీల నిర్వహణలో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం పనుల నిర్వహణ పట్ల కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న ఐదేళ్ల కాలంలో సర్పంచ్ల సమన్వయంతో అభివృద్ధి పాటుపడడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీఓ అనిల్ కుమార్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులను సర్పంచులు శాలువతో సత్కరించారు.

సాయి రామాచార్యులుకు నంది అవార్డు



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని భూంపల్లి సాయి రామాచార్యులు వాస్తు, జోతిష్య పురోహిత రంగంలో తెలుగు వెలుగు మహా నంది జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం వరంగల్ టీఎన్జీఓ భవన్‌లో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూంపల్లి సాయి రామాచార్యులకు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం అవార్డును పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

వృథాగా కడెం ప్రాజెక్టు నీరు



నవతెలంగాణ-జన్నారం

కడెం ప్రాజెక్టు నుంచి లెఫ్ట్ కెనాల్ ద్వారా విడుదల చేసిన నీరు వృథాగా పోతుంది. మండలంలోని ఇంధన్‌పెల్లి, మురిమడుగు, కలమడుగు తదితర గ్రామాల్లో కడెం ప్రధాన కాలువ నుంచి వచ్చిన నీరు కుంటలు, లోయల్లో పడి వాగులోల నుంచి గోదావరిలోకి వృథాగా పోతుంది. మండలంలో అక్కడక్కడ ఉన్న యాసంగి పొలాలకు, మొక్కజొన్న పంటలకు, చెరువులు నింపుకోవడానికి ఆ నీటిని వినియోగించుకోవాలని ప్రాజెక్టు అధికారులు సూచిస్తున్నారు. నీటిని వృథాగా పోనియవద్దని రైతులను కోరుతున్నారు. గ్రామాల్లో ఉన్న చెరువులు నింపడానికే ఈ నీటిని విడుదల చేశామని, రైతులు సద్వినియోగం చేసుకొని నీటిని వృథా పోకుండా చూసుకోవాలని ప్రాజెక్టు జేఈ రాజు తెలిపారు.

వాణి నికేతన్ పూర్వ విద్యార్థుల అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలోఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం నిర్విరామంగా కొనసాగించే అన్నదానం కొనసాగింపుగా 234వ వారం అన్నదాన కార్యక్రమంలో సోల్లేటి రాజారెడ్డి జ్ఞాపకార్థంగా రాజా విద్యానికేతన్ హైస్కూల్ 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో అన్నదానం చేశారు. బెల్లంపల్లి పట్టణంలో కాంట చౌరస్తా, పల్లేటూరి బస్టాండ్‌లో సుమారు 400 మందికి మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, నారయణ, రంగ సురేష్, మేదరి రవి, బియ్యాల ఉపేందర్, సిద్దమల్ల రఘు, చెందుపట్ల లింగమూర్తి, యూసుఫ్, శివ పాల్గొన్నారు.

ఐకే-1ఏ పిట్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఏరియా పరిధి ఇందారం 1ఏ గని సీఐటీయూ పిట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నాయకులు సమావేశమయ్యారు. బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి హాజరయ్యారు. ఇందారం గని కమిటీ కార్యదర్శిగా సిరికొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా నవీన్, ఆర్గనైజర్‌గా ఖాదిర్ భాషా, బీసీడీ రిలే బాధ్యులుగా సంతోష్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విచారణ ఏమైనట్టు..?

- బాధ్యులపై చర్యలు కరువు
- ఆదర్శ పాఠశాలలో వివాదాలు షరా మామూలే..!
- పట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో తరచూ వివాదాలే జరుగుతున్నాయి. పాఠశాలలో విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేశారంటూ ప్రిన్సిపల్‌పై ఆరోపణలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. దీనితో పాటు ఉపాధ్యాయులు హాజరు పట్టికపై ఇంకు పోసి హాజరు పట్టికను మార్చేందుకు ప్రయత్నం చేశారని సిబ్బంది స్వయంగా ప్రిన్సిపల్‌పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై విచారణకు గత నెల 18న ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. ఫిర్యాదులపై కమిటీ వచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ విచారణ తీసుకుంది. తమ నివేదికను ఉన్నతాధికారులకు అందించింది. విచారణ జరిగి దాదాపు 20 రోజులకు పైగా ఎలాంటి చర్యలు లేవు. ఉన్నతాధికారుల తీరుపై మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

హాజరు పట్టికలో ఇంకు వివాదంపై బాధ్యులు ఎవరు..?

సాధారణంగా చిన్నచిన్న విషయాలకి మేమోలు జారీ చేసి బదిలీలు చేసే అధికారులు ఏకంగా హాజరు పట్టికని మార్చి పాఠశాలకు రాకుండా వచ్చినట్లు చూపించేందుకు హాజరు పట్టికనే తారుమారు చేసే ప్రయత్నం చేశారు. ఎన్ని కమిటీలు వేసిన ఎన్ని నివేదికలు సమర్పించిన పాఠశాలలో వివాదాలు షరమాములే అన్నట్టుగా ఉన్నాయి. తప్పు చేసిన వారిపై చర్యలు లేకపోవడంతోనే పాఠశాల సిబ్బందిలో భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహారిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇంకు పోసిన బాధ్యుల గురించి నివేదికలో ఉందా..? లేదా..? అనే విషయం కూడా బయటకు రావడం లేదు.

ప్రిన్సిపల్‌పై ఆరోపణలు..!

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌పై ఆరోపణలు తరుచు వస్తున్నాయి. పాఠశాల వార్షికోత్సవం పేరిట ప్రతి విద్యార్థి నుండి రూ. 200 వసూలు చేసి వార్షికోత్సవం నిర్వహించకపోగా వాటిని పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశానని చెప్పి సొంతానికి వాడుకున్నారే ఆరోపణలున్నాయి. రాష్ట్ర విద్యా సాధన సర్వే(ఎస్ఈఏఎస్) విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా వాటిలో ఇంటర్ విద్యార్థులు పరిశీలకుగా వ్యవహరించారు. అందుకుగాను ప్రభుత్వ నుండి రూ.500 అందగా వాటిని సైతం ఆమె దగ్గరే ఉంచుకొని అధికారులకు ఫిర్యాదు చేసేంత వరకు ఇవ్వలేదన్న మరో ఆరోపణ. సిబ్బందికి సంబంధించిన సుమారు రూ.5 లక్షల డీఏ బకాయిలు ప్రిన్సిపల్ ఖాతాలో జమ కాగా వాటిని సైతం సొంతానికి వాడుకోగా తమ డబ్బులు తమకు చెల్లించాలని సిబ్బంది అనడంతో చెల్లించినట్లు సమాచారం.

విచారణ పేరిట కాలయాపన


పాఠశాలలో కొద్ది సంవత్సరాలుగా ఏదో ఒక వివాదం జరగడం వాటిపై కమిటీలు వేసి విచారణ చేపట్టడం పరిపాటిగా మారింది. గతంలో పాఠశాల ప్రిన్సిపల్‌పై చాలావరకు ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై విచారణ చేపట్టి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పేరెంట్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విచారణకు వచ్చే అధికారులను ప్రిన్సిపల్ మేనేజ్ చేస్తున్నట్లు విమర్శలున్న నేపథ్యంలో నాయానో, బాయానో ఇచ్చి ఎంతటి వారినైనా ఒప్పించే తత్వం ఉందంటూ ప్రిన్సిపల్‌పై బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు

తిరుపతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్



పాఠశాల ప్రిన్సిపల్ పై పలుమార్లు ఫిర్యాదులు మా దృష్టికి వచ్చాయి. ఇదే విషయమై ఉన్నతాధికారులకు సైతం మేము ఫిర్యాదులు చేశాం. పిల్లల నుండి పదేపదే డబ్బులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇలాగే వివాదాలు జరుగుతున్నాయి. కమిటీలు వేస్తున్నారు. నివేదికల సమర్పిస్తున్నారు కానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల పాఠశాల ప్రతిష్టకు భంగం వాటిల్లుతుంది. పాఠశాల ప్రిన్సిపల్ చేష్టల వల్ల ఒకప్పుడు ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఇప్పుడు గణనీయంగా తగ్గింది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.





సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ జోక్యాన్ని ఖండిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం రాజకీయాలకు తలోగ్గి వారు చెప్పిన విధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో కార్మికులకు ప్రమోషన్ల పత్రాలను, కారుణ్య నియామక ఉద్యోగ పత్రాలను డివిజన్ల వారీగా ఇచ్చేవారని, రాజకీయ జోక్యంతో ప్రస్తుతం హైదరాబాదుకు వెళ్లి తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా గతంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు కొత్తగూడెంలో నియామక పత్రాలను అందజేసి, ఒకరోజు ఉద్యోగం చేసిన తర్వాత విధులకు తీసుకోకపోవడం, మళ్లీ వారిని కూడా హైదరాబాద్‌కు వచ్చి నియామక పత్రాలు తీసుకోవాల్సిందిగా తెలపడం పట్ల ఏఐటీయూసీ యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన కూడా ఇప్పటివరకు యాజమాన్యం గుర్తింపు లెటర్ ఇవ్వలేదన్నారు. గుర్తింపు సంఘం నాయకులు, అనుభవజ్ఞులైన కార్మికులు లేకుండానే మళ్లీ డిపార్ట్మెంట్ కమిటీలు నిర్వహిస్తామని యాజమాన్యం చెప్పడం సరికాదన్నారు. గనులలో సరైన యంత్ర సామాగ్రి లేదని, మ్యాన్ పవర్ తక్కువగా ఉందని చెప్పినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ గనులపై కార్మికులకు తెలిపి అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే రాజకీయ పలుకుబడితో అండర్ గ్రౌండ్‌లో ప్రమోషన్ తీసుకున్న కూడా సర్ఫేస్‌లో రెండవసారి ప్రమోషన్లు ఇవ్వడాన్ని తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, బ్రాంచ్ సహాయక కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

కాసిపేట : సింగరేణిలో రాజకీయ జోక్యం తగదని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యక్షులు బియ్యల వెంకస్వామి, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ పేర్కొన్నారు. సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా తండ్రులు అన్ ఫిట్ అయి కొడుకులు, అల్లుళ్ళు, కూతుర్లు ఫిట్టాయిన 400 మంది డిపెండెంట్ ఉద్యోగులను పెండింగ్‌లో పెట్టడం జరిగిందన్నారు. వారిని వెంటనే ఉద్యోగంలోకి చేర్చుకోవాలని ఏఐటీయూసీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి అన్ని ఏరియా జీఎంలకు వినతిపత్రాలు అందించిందన్నారు. సీఅండ్ఎండీ బలరాం నాయక్ దృష్టికి కూడా మా సంఘం నాయకులు తీసుకువెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగంగా ఏరియా జీఎం కార్యాలయాల వద్ద ఇచ్చే ఉద్యోగ నియామక పత్రాలను యాజమాన్యం, గుర్తింపు సంఘంతో కలిసి ఇవ్వాలని, కాని ప్రభుత్వ రాజకీయ జోక్యంతో వీరిని హైదరాబాద్‌కు పిలిపించి వీరికి మంత్రుల చేతుల మీదుగా ఉద్యోగ నియమాక పత్రాలు ఇస్తామని ప్రయత్నం చేయడం సరికాదన్నారు. వెంటనే ఉద్యోగ నియామక పత్రాలను ఆయా ఏరియాలలో జీఎం కార్యాలయాల్లో అందించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణప్రాంత క్రీడల అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్

గ్రామీణ ప్రాంత క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఏఎంసీ-2 గ్రౌండ్‌లో కాకా వెంకటస్వామి స్మారకార్థం పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ యువనేత గడ్డం వంశీకృష్ణ, కాకా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మండల అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో క్రీడల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. స్వర్గీయ వెంకటస్వామి కాక క్రికెట్ పోటీల విస్తరణకు కృషి చేశారన్నారు. ఐసీసీ 2006 ఇండియాలో ప్రపంచ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడానికి కాక వెంకటస్వామి కృషి చేశారని గుర్తు చేశారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ గ్రామీణ ప్రాంత క్రీడల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ మత్తమారి సూరిబాబు, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ కార్కురి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరీ స్వామి పాల్గొన్నారు.

బీఎంఎస్ యూనియన్‌లో చేరికలు



నవతెలంగాణ-నస్పూర్

బీఎంఎస్ యూనియన్‌లో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సీహెచ్ అశోక్, సీనియర్ మైనింగ్ సర్దార్ కట్ట ఈశ్వర చారి ఎబీకేఎంఎస్ కార్యదర్శి, జేబీసీసీఐ, సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ బోర్డ్ సభ్యులు పి.మాధవ నాయక్, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి టీఎస్. పవన్ కుమార్ సమక్షంలో చేరారు. ఆదివారం కొత్తగూడెం బీఎంఎస్ భవన్‌లో కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు జీవి. కృష్ణ రెడ్డి అధ్యక్షతన చేరికలు జరిగాయి. అనంతరం అశోక్, ఈశ్వరచారి మాట్లాడుతూ కార్మికుల పక్షాన బీఎంఎస్ చేస్తున్న పోరాటాలు, కార్మిక హక్కులను కాపాడేందుకు చేస్తున్న కృషికి ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా కోశాధికారి మోహన్ పాల్గొన్నారు.

మోటివేషన్ ట్రస్ట్ సొసైటీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ - జన్నారం

మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ సొసైటీ సేవలు అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన ఆయనను మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ బాదావత్ ప్రకాష్ నాయక్ మర్యాదపూర్వ కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా చేస్తున్న పనులను అభినందనీయమన్నారు. ఒక సైకాలజిస్ట్‌గా పిల్లలకి మోటివేషనల్ కార్యక్రమాలు చేపడ్డం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రవీణ్ బానావత్, కాంత బనావత్, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తున్న మోడీ

- కార్మికులకు, రైతులకు చేసిందేమీ లేదు
- 16న బంద్ విజయవంతం చేయాలని పిలుపు
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్తం సమ్మె, గ్రామీణబంద్ విజయవంతానికి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సెంట్రల్ గార్డెన్‌లో జిల్లా సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రం అనుసరిస్తున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలో చేపట్టిన నాటి నుంచి పదేండ్ల కాలంలో కార్మికులు, ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తు పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను తీసుకువస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు కోడ్లను తెచ్చిందన్నారు. నిత్యావరస ధరలు పెంచుతూ సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించిందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలవుతున్న కార్మికులకు రైతులకు చేసిందేమి లేదన్నారు. లేబర్ కోడ్‌లను మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం రైతులు బుద్ధి చెప్పాలని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లు అమలు అయితే సంఘం పెట్టుకునే హక్కుని కోల్పోతారన్నారు. వ్యవసాయ చట్టాలను తీసుకొస్తే రైతులందరికీ అన్యాయం జరుగుతుందని తెలియజేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని కార్మికులను రైతులను కోరారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణబంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రాజన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిర్ర దేవేందర్, జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు, బీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు నారాయణ, జిల్లా అధ్యక్షులు కాడదారపు అశోక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి దేవదాస్‌చారి, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక దేవిదాస్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, జగన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, డి.వెంకటమ్మ, నైతం శోభ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు అగ్గిమల్ల స్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెర్కా దేవిదాస్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రాజు, కళ్లెపెల్లి గంగయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు సుభద్ర, దర్శనాల నగేష్, పొచ్చన్న పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో రేపటి నుంచి ఈ నెల 8 వరకు పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే 'గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం అభియాన్)' కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. రేపటి నుంచి ఈ నెల 8 వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రతీ ఒక్కరు 24 గంటల పాటు శక్తి కేంద్ర ప్రముఖ్ నుంచి జాతీయ స్థాయి అధ్యక్షుని వరకు పల్లెల్లో, నగరాలలో పర్యటించనున్నారని అన్నారు. రాబోయే లోకసభ ఎన్నికల్లో 51 శాతం ఓట్లు సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలను, పార్టీని పటిష్ఠం చేయడానికి ఈ పల్లెకు పోదాం అభియాన్ ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గావ్ చలో అభియాన్ జిల్లా కన్వీనర్ స్వామి యాదవ్, జిల్లా కో కన్వీనర్ సందీప్ కుమార్, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీ నారాయణ, జిల్లా మీడియా ఇంచార్జ్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

నవతెలంగాణ-బాల్కొండ

గ్రామీణ క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని అన్నారు. బాల్కొండలో వినోద్‌కుమార్ మెమోరియల్ పోటీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని నిజామాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్ పేర్కొన్నారు. కబడ్డీ ఆటకు కూడా ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. బాల్కొండ, మెండోరలో యువ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినోద్ కుమార్ మెమోరియల్ స్మారక కబడ్డీ, వాలీబాల్ పోటీలను మెండోరా మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి యువ యూత్ ఆధ్వర్యంలో వినోద్ కుమార్ మెమోరియల్ స్మారక కబడ్డీ క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, చరణ్, నరేందర్ గౌడ్, క్రీడా ఉపాధ్యాయులు యువకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-జైనూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమని జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పటేల్ సోనుపటేల్ ఆధ్వర్యంలో టోర్నమెంటు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొన్ని రోజుల నుండి ఈ టోర్నమెంటు ప్రశాంతంగా జరిగిందన్నారు. క్రీడల్లో రాణించి మండల, జిల్లాస్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో కూడా యువత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో మొదటి బహుమతి రూ.30 వేలు జైనూర్ ఎలవన్ స్టార్‌కు, రెండో బహుమతి దేవేందర్ పౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేలు నగదుతో పాటు కప్పును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విమల ప్రకాష్, ఎస్సీ యూత్ ప్రెసిడెంట్ కొట్నాక దౌలత్, యువత, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ అన్నారు నియోజకవర్గంలోని నందిపేట్ మండలం ఖుదావంద్‌పూర్‌లో ఆదివారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమనికి ముఖ్యఅతిథి విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గ నాయకులు జిల్లా మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షులు గొర్త రాజేందర్, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు రాజేందర్ , ఎన్ ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు శశి, మండల కాంగ్రెస్ నాయకులు తుక్కన్న, తోట మహేష్, ఖుదావంద్‌పూర్ గ్రామశాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు ఏడ్డిగారి నిఖిల్, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను డీఈఓ సందర్శించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో గల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ని జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ హాస్టల్ యూనిట్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోగల ఖిల్లా చౌరస్తా ప్రాంతంలో గల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ కమిటీ కార్యదర్శి బాబురావు మాట్లాడుతూ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో మెనూ ప్రకారం చికెన్ పెట్టాలని, కానీ బిల్స్ రాని కారణంగా టెండర్ వేసిన వ్యక్తి పెట్టలేదని తెలిపారు. గుడ్లు కూడా పెట్టడం లేదని, దానితో పాటు కుళ్లిపోయిన కూరగాయలు ఉన్నాయని, స్కూల్ హెడ్మాస్టర్‌తో మాట్లాడితే సమస్య పరిష్కరిస్తామని అన్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ స్కూలు వెంటనే సందర్శించాలని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ యూనిట్ కమిటీ సభ్యులు వరదరాజు, సజన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రతిభా కళాశాల పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సిఈఓ), ధర్మారం-బి లో ఆదివారం టిఎస్‌డబ్ల్యూఆర్ సీఈఓ సెట్-2024 టిఎస్ డబ్ల్యూఆర్ సీఈఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కొరకు) అనే ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 504 మంది విద్యార్థులను అలాట్ చేయగ 494 మంది హాజరు అయ్యారని పరీక్ష ప్రశాంతంగా ముగుసిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయకర్త బి. సంగీత తెలిపారు. నిజామాబాద్ జిల్లా మొత్తంలో (6) పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగ మొత్తం 2747 మంది విద్యార్థులకు గాను 2659 (97) మంది ఈ పరీక్షకు హాజరు కాగా 88 (3శాతం) మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ధర్మారం-బి పరీక్షా కేంద్రంలో పరీక్షా సజావుగా నిర్వహించడం కొరకు డిగ్రీ కళాశాల బాలికల ఆర్మూర్‌ను నియమించారు. ఆర్సిఓ అలివేలు పరీక్షా కేంద్రంను సందర్శించి పరీక్షా నిర్వహణను పరిశీలించారు.

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో..

నవతెలంగాణ-సిరికొండ

జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబురాలు-2023లో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సత్యశోధక్ విద్యార్థులు పాల్గొని ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ద్వితీయ స్థానం పొందారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. పాఠశాలకు చెందిన భార్గవ్ రెడ్డి, యశస్విని, కృతిక జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను చాటారని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, జె వి వి జిల్లా ఇంచార్జ్ చెలిమెల రాజేశ్వర్, ట్రస్మా పట్టణ అధ్యక్షులు ధర్మరాజు చేతుల మీదుగా బహుమతులు, ప్రశాంస పత్రాలు అందుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సతీష్, జె వి వి ప్రతినిధులు మోహన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టిఎంపిహెచ్ఈయు అధ్యక్షులుగా రవిచందర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ మెడికల్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టిఎంపిహెచ్ఈయు) జిల్లా అధ్యక్షులుగా రవిచందర్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సమావేశం నిజామాబాద్ జిల్లా బ్రాంచ్ ఎంప్లాయీస్ జనరల్ బాడీ సమావేశం సుభాష్‌నగర్‌లోని రిషి స్కూల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా శాఖకు ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర చీఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి. రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్పె రవీందర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో జిల్లా అధ్యక్షుడు కె. రవి చందర్, జిల్లా కార్యదర్శి జె.రవీందర్, జిల్లా కోశాధికారి టి. రవి, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.మధుకర్, బి.నారాయణ, గంగనర్సు, శ్రీధర్, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా టి.వినోద్, వనజ, జి.రజిత, డి.రాజేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జానకి, కె.మధు సుధన్, రజనీ, శివలీల, జిల్లా ఈసీ సభ్యులుగా లక్ష్మి, లత, పి.సవిత, సరితను ఎన్నుకున్నారు.

రెవెన్యూ శాఖకు పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి

- రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం
- పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా రెవెన్యూ శాఖ పూర్తిగా నిర్వీర్యమైందని, దానికి మళ్లీ పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని రెవెన్యూ అధికారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో తెలంగాణ తహసీల్దార్ల అసొసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మెళనం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పుష్పగుచ్చాలు, జ్ఞాపికలతో పాటు సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

ఆదిలాబాద్ నుండే తొలి సమావేశం నిర్వహించడం సంతోషం..

ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో నిర్లక్ష్యానికి గురై మరుగున పడిన రెవెన్యూ శాఖకు మళ్లీ పూర్వవైభం తీసుకువచ్చేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ప్రభుత్వానికి రూ.10వేల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే రెవెన్యూశాఖకు బడ్జెట్‌లోనూ అదే స్థాయిలో నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం వీఆర్ఏలను చెట్టుకొకరిని, పుట్టకొకరని పడేసిందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన ఆడబిడ్డలు ఏడుస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిందని అలాంటి వారిని తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు రెవెన్యూ వ్యవస్థ మరింత దగ్గర కావాలని, ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారి ఉండాలనే ఉద్యేశంతోనే తాను ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీలో సభ్యుడిగా చేరానని తెలిపారు. హక్కులు, బాద్యతలతో పాటు రెవెన్యూ ఉద్యోగులకు ఎలాంటి కష్టమొచ్చిన అండగా ఉంటామని భరోసానిచ్చారు.



హౌజింగ్ స్కీంను తీసుకొచ్చేలా కృషి..

హౌజింగ్ స్కీంను తీసుకొచ్చి ఇండ్లను నిర్మించి, ఇచ్చేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. వీఆర్‌ఓల కారుణ్య నియమాకాలు, 61 ఏండ్ల వయస్సు నిండిన వీఆర్‌ఏల కుటుంబీకులకు ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్వీస్ రూల్స్ పరంగా అన్యాయం జరిగిన ఉద్యోగులకు న్యాయం చేకూరేలా అండగా ఉంటామని తెలిపారు. అదే విధంగా ఆపరేటర్లను రెగ్యూలర్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఉద్యమాల గడ్డ ఆదిలాబాద్ నుంచే తొలి సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రాములు, ప్రధాన కార్యదర్శి పాక రమేష్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల అడిషనల్ కలెక్టర్లు శ్యామలాదేవి, మోతీలాల్, ఉమ్మడి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- గురుకులం ప్రత్యేక అధికారి ఏకాంబరం



నవతెలంగాణ-జైనూర్

చదువుతోనేఉజ్వల భవిష్యత్తు సాధ్యమని గురుకులం ప్రత్యేక అధికారి ఏకాంబరం అన్నారు. ఆదివారం మండలంలోని బూసిమెట్ట గ్రామ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలో అందిస్తున్న మౌళిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు అందిస్తున్న విద్యపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా బాలలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశ్యంతోనే అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంలో కీలకమైన పాత్ర ఉపాధ్యాయులదేనని, ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తు గురించి మంచి విద్యనందించి వంద శాతం పదో తరగతిలో ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పరీక్షలు రాయలన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తు మార్పులు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. అనంతరం పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు ప్రతి విద్యార్థి పాఠశాలలో అందిస్తున్న మౌళిక సదుపాయాల గురించి చర్చించారు. అనంతరం పాఠశాలలోని మౌళిక సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల వార్డెన్, ప్రిన్సిపాల్, సిబ్బంది మొదటిసారి పాఠశాల సందర్శనకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ స్వేత, కృష్ణవేణి, అధ్యాపకులు నాగోరావు, రాజేశ్వర్, నీలకంఠ్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం శ్రద్ధానంద్ గంజ్ కూరగాయల హమాలి వర్కర్స్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా హమాలి అధ్యక్షులు మోహన్ శివకుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని అన్నారు. రైతులు ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలని 13 నెలలపాటు రైతులు ఉద్యమం చేపట్టారన్నారు. అలాగే ఎన్నో ఏళ్ల నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే విధంగా ఈ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు, కార్మికులకు, రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు రాజు, గంగాధర్, రమేష్, శీను, ఫెరోజ్, ఇసుఫ్ ఖాన్, మల్లేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు మౌలిక వసతులు కల్పించాలి

- అర్బన్ ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని దుబ్బా ప్రాంతంలో నివసిస్తున్న గుడిసె వాసులకు మౌలిక వసతులు కల్పించాలని ఇండ్లు, ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బప్రాంతంలో సర్వేనెంబర్ 171,172 లలో గల ప్రభుత్వ భూమిలో రెండు సంవత్సరాలుగా 300కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని తెలిపారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కరెంటు మీటరు ఇవ్వాలని, తాగునీటి సమస్య పరిష్కారం కోసం మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌ను పంపించాలని కోరారు, ఇండ్ల పట్టాలు ఇప్పించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి ఉంటుందని, త్వరలోనే అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇండ్లు ఇళ్ల స్థలాల సాధన కమిటీ కన్వీనర్ మల్యాల గోవర్ధన్, కమిటీ సభ్యులు గట్ల గంగాధర్, శ్రీధర్, మునావార్, మీరా, రాంచందర్, జమీర్, రిహానా బేగం, అంజయ్య, గుడిసె వాసులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- ఇన్‌కంట్యాక్స్ సమస్య పరిష్కరించాలి
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ నామ్‌దేవ్‌వాడలో ఆదివారం జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ డిఏ లను వెంటనే విడుదల చేయాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతించాలని, ఫిట్మెంట్ 30శాతం అనుమతించాలని అన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర సంఘం పక్షాన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి పదవ తేదీన పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని నిర్వహించాలని తీర్మానించారు. ఈ సభకు ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త దేవి, కామారెడ్డి పోలీసు సూపర్డెంట్ సింధు శర్మను ఆహ్వానించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి సన్నాహకంగా మహిళ పెన్షనర్లతో ఈనెల 8న మల్లు స్వరాజ్యం ట్రస్టు భవనం సన్నాహక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దీనికి సంబంధించి మహిళా పెన్షనర్లు సమావేశానికి తప్పక రావాలని కోరారు. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్ల కార్యవర్గాలను పునర్ నిర్మించాలని, దీనికి సంబంధించి వెంటనే తేదీలను డివిజన్ నాయకులు తెలపాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలోని ఈపీఎస్ పెన్షనర్లను ఐక్యపరిచి ఆందోళన, సంఘ నిర్మాణం తదతర కార్యక్రమాల నిర్వహణకు అద్దంకి ఉషాన్ (బోధన్)ని జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులను ఆర్గనైజ్ చేయటంకోసం ఈ వీ ఎల్ నారాయణను ఎన్నుకున్నామని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ సమస్యలపై వెంటనే డిటిఓని కలిసి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సంఘం పక్షాన త్వరలో మెడికల్ క్యాంపును నిర్వహించాలని తీర్మానించారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా..

నవతెలంగాణ-తలమడుగు

అధైర్య పడొద్దు అండగా ఉంటానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని భరంపూర్ రైతు వేదిక భవనంలో 28 గ్రామపంచాయతీల సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారందరికీ ఒకే వేదికపై శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేదని, అధైర్య పడొద్దని, మీకు అండగా ఉంటానని మాజీ సర్పంచులకు, కార్యకర్తలకు, భరోసా కల్పించారు. పదవీకాలంలో ఉన్నప్పుడు సర్పంచులందరూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ సకాలంలో వారు చేసిన పనులకు బిల్లులను కూడా సకాలంలో ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ కేవలం రెండు రోజులే జరగగా కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు మిషన్ భగీరథ నీళ్ల ఎవరికి రావడం లేదంటూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కొండను తవ్వించి, మిషన్ భగీరథ పైపలైన్ ద్వారా రత్నాపూర్ గ్రామ గిరిజనులకు నీళ్లందిస్తున్న ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు.



కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నాడో తనకే తెలియదని, సీఎం పదవి కూడా ఉంటుందో పోతుందోనని ఆందోళనలో ఉన్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు కావస్తున్న రైతుబంధు రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను సైతం అభివృద్ధి పరిచే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మాజీ మంత్రి ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉందామని పార్టీ కోసం పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట వెంకటేష్, కిరణ్ కుమార్, తిరుమల్‌గౌడ్, కృష్ణారెడ్డి, అబ్దుల్లా, కేదారీశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్కగా చదివి సైంటిస్టులుగా ఎదగాలి

- జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- ఆక్స్‌ఫర్డ్‌లో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు హాజరవగా, ట్రస్మా పట్టణ అధ్యక్షులు ధర్మరాజు, పాఠశాల నిర్వాహకులు మామిడాల మోహన్, జిఆర్ఎమ్ సొసైటీ అధ్యక్షులు నరేష్ బాబు హాజరయ్యారు. తొలుత జన విజ్ఞాన వేదిక కన్వీనర్ చెలిమెల రాజేశ్వర్ మాట్లాడుతూ.. దైనందిక జీవితంలో సైన్స్ ప్రాధాన్యత ఎంతో ఉందని, మూఢనమ్మకాలకి వ్యతిరేకంగా జన జీవితంలో సైన్స్ ప్రాధాన్యతని తెలియజేస్తూ జనవిజ్ఞాన వేదిక ఎన్నో కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన కలిగిస్తూ వారికి



ఎన్నో రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని చక్కగా చదివి సైంటిస్టులుగా ఎదగాలని హితవు పలికారు. ట్రస్మా పట్టణ అధ్యక్షులు ధర్మరాజు మాట్లాడుతూ.. చిన్న నాటి నుండి విద్యార్థుల్లో సామాజిక స్పృహ అలవాటు చేసు కోవాలని విజ్ఞాన శాస్త్రాన్ని అవపోసన పట్టుకొని జీవితంలో ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని కోరారు. పాఠశాల నిర్వాహకులు మోహన్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని తదనుగుణంగా ప్రణాళిక వేసుకొని కష్టపడినట్లయితే తప్పనిసరిగా అను కున్న గమ్యాన్ని చేరుతారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాన్ని, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంస పత్రాలను ముఖ్య అతిథులు అందజేశారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 9, 10, 11వ తేదీల్లో జనగాంలో రాష్ట్ర స్థాయి పోటీలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఉపాధ్యాయు లకు జిఆర్ఎం సొసైటీ ఆధ్వర్యంలో భోజన వితరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సైన్స్ ప్రజెంటేషన్ "మిరాకిల్ ఎక్స్పోజర్" లో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీశైలం, అనూష ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల హెడ్ మాస్టర్ వి.రమణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-కంఠేశ్వర్

పంచముఖి మున్నూరు కాపు సంఘం షిర్డీ సాయి నగర్ వినాయక నగర్ అధ్యక్షుడిగా హరిదాసు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుల చారి సంతోష్, కోశాధికారిగా ఎల్మల శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు హరిదాసు సాయిరెడ్డి మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కాలపరిమితి (2024-25)కోసం పంచ ముఖి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఎల్లపుడు సంఘ సభ్యులకు అందుబాటులో ఉంటానని, సంఘ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధిలో దూసుకుపోయేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శి కోసం ఇద్దరు పోటీ పడగా కులచారి సంతోష్ తన ప్రత్యర్థిపై అత్యధిక ఓట్లు సాధించి గెలుపొందారు. ఈ సందర్భంగా రెండు సంవత్సరాల పాటు సేవలందించిన పూర్వ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి ఆమ లడ్డు శంకర్, వైసాక్షి సంతోష్, ఎల్మాల శంకర్‌ను నూతన అధ్యక్ష, కార్యదర్శులు సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులను సంఘ సభ్యులు పూలమాల, శాలువాతో సత్కరించారు. త్వరలో మిగితా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు ఆమ లడ్డు శంకర్, పూర్వ ప్రధాన కార్యదర్శి వైశాక్షి సంతోష్, గౌరవ కుల పెద్దలు శ్రీశైలం, హరిదాసు మారుతి పాల్గొన్నారు.